# ఓల్డ్ ఈజ్ గోల్డ్!

భగీరథరావు పరమ సాధువు. కథలు రాయటం అతని వ్యాపకం! రాను రాను అది వ్యాపారంగా మారింది. ఒక్కరోజు కథరాయకపోతే చెయ్యి జిలపుడుతుంది. అరచేతికి వేళ్లకు గజ్జిసోకిన వాడిలా బరుక్కుంటాడు!

కథరాయటమంటే బహుతేలిక భగీరథరావుకు! రాయటంకోసం 'మూడ్'తో పన్లేదు. బుర్రగోక్కోడు! తలగోడ కేసికొట్టుకోడు. ఇంట్లో వున్న యావన్మంది ఫామిలీ మెంబర్స్‌ను మూడౌట్ అయి తిట్టిపోయడు. సిగరెట్ మీద సిగరెట్ వూదేయడు. 'మందు' గట్రాపుచ్చుకునే సాహసం చేయడు. ఎలాంటి వైద్యవ్వేషాలూ వేయని రైటర్ భగీరథరావంటే పాపం పూర్ ఫెలో! అంటే బీదవాడని కాదు దాని అర్థం! తెలుగుభాషలో అర్థాలు... పెడర్థాలు... నానార్థాలు.. బోలెడు ఏడ్చినయ్.

అతగాడికో భార్య! ఏకవచనం శ్రేష్ఠం! బహువచనాల జోలికివెడితే అన్నీ అనర్థాలే! ప్లూరల్ పెద్ద నేరం! పోలీసులు కేసుపెట్టి బొక్కలో తోస్తారు! రహస్యంగ సాగినన్నాళ్లు బేపర్వా. వ్యవహారం వీధినపడితే కష్టాలే! తాళి కట్టించుకున్న ఆఫీషియల్ వైఫ్ చావగొట్టి చెవులు మూస్తుంది. విడాకుల కోసం కోర్టు మెట్లమీద నిరాహార దీక్ష చేసేడుస్తుంది. అన్నీ కష్టాలు... కడగండ్లే!!

మగాడు అస్వతంత్రుడు! కట్నం కోరితే బాకావూదేసి కేసుపెట్టేస్తారు. పిన్న వయసులో అనగా 21 ఏళ్లు రాకముందే తొందరపడి పెళ్లాడితే జైలు ప్రాప్తే! అప్పుడు లోకం కోడైకూస్తుంది. అమగాడికి తర్వాత చచ్చినా మ్యారేజ్ అయిఏడవదు. బ్రతికినన్నాళ్లు భీష్ముడి బ్రతుకే! అంటే... బ్రహ్మచారిగ స్థిరపడక తప్పదు. అది రూలు!

సంపాదనలేని మగాడైతే ఎందుకూ పనికిరాని చవట అనేసి ముద్రవేస్తుంది శ్రీమతి! అత్తమామల చీత్కారాలు చీదరింపులు!... పిల్ల జల్ల కలక్కపోతే పనికిరాని వాడనే ముద్ర పడిపోతుంది! మగాడికే అనేక కష్మాలు!

ఇలాంటి భయాలేమీ లేనివాడు భగీరథరావు ఇతగాడికి భార్య వుంది. బ్రహ్మాండమైన ఉద్యోగం వుంది. అరడజను మంది పిల్లలూ కలరు!

బ్రతుకుబండి ఈడ్చి ఈడ్చి... సాగిలపడి... ఇటీవలే రిటైరైనాడు! పెన్షన్ లేని జాబు చేసిన వాడవటాన పదవీ విరమణ చేశాక ఆదాయానికి గండి పడింది!

ఇతగాడి కున్న ప్లస్ పాయింటల్లా... కథలు గట్రా రాయగల టేలెంట్ వుండటమే! అదే ఇతడిని బ్రతికిస్తోంది! వారానికి నాలుగైదు పత్రికల్లో... నెలకు ఓ పదిమాస పత్రికల్లో భగీరధరావు 'స్టోరీ'లు పబ్లిష్ అవుతూన్నప్పటికే.... ఫిఫ్టీపర్సెంట్ కథలకు మాత్రమే రెమ్యూనరేషన్ వచ్చేడుస్తుంది. మిగతావన్నీ 'ఓ.సీ'నే!

అందుకే ఈ మధ్యన... అంటే రిటైరైన తదుపరి ప్రతిఫలం ఇవ్వని పత్రికలకు కథలు పంపరాదని భీషణ ప్రతిన పూనాడు! ఆకారణంగా బడుగు పత్రికలు తెగ బాధపడినయ్!. అయినా సరే జాలి చూపతల్చుకోలేదితగాడు.

ఇప్పటివరకు నాలుగైదుటన్నుల కథలు రాసివుంటాడు! ఇంకా శానాబోలెడు రాయాలనే తపన వున్నవాడు. లోగడ కథలన్నీ చేతితోటే రాయాల్సి రావటంతో... వేళ్ల నెప్పులు పుట్టి తరచువాచి పోతూండేవి.

కంప్యూటర్లు రంగ ప్రవేశం చేశాక భగీరథ రావుకు కథలు డి.టి.పి చేయటం బహుతేలికైన మార్గంగా తోచింది. ఉద్యోగానికి రిటైర్మెంటు వున్నప్పటికీ... కథల విషయంలో ఈ కండిషన్ వర్తించదు కనుక.. వూపిరిపోయే దాకా కథలు రాసి తీరాల్సిందేనని తీర్మానించుకున్నాడు.

కథ రాయని రోజున కడుపునొప్పెడుతుంది. తలనాదుగ అసౌకర్యంగా వున్నట్టు ఫీలింగు! కడుపు వుబ్బరంగ వున్నదన్పిస్తూంటుంది.

ఇన్ని రకాల బాధల నుండి విముక్తి కోసం చచ్చినట్టు కథ రాసి తీరాల్సిందే! తప్పదు! అప్పుడు... కథరాయటం పూర్తి అయిన క్షణంలో తొమ్మిది నెలలు మోసిన మహిళకు కాన్పు అయితే ఎంత హాయిగా సుఖంగ వుంటుందో... అంతటి హేపీనెస్ ఫీలవుతాడు భగీరధరావు.

ఇన్నేళ్లు కథా రచయితగా బోలెడంత అనుభవం వున్నా.. అడప తడప కథలు పత్రికలకు నచ్చక తిరిగొచ్చేస్తుంటయ్! ఇది సర్వ సాధారణం! ఎంతటి పెద్ద రైటర్ అయినా ఎదుర్కొని తీరక తప్పదు.

కథలు రాయటం భగీరథ యత్నమేమీ కాదు. భగీరధరావు దృష్టిలో అర్ధ గంటలో పది పేజీల కథను ఆలవోకగ ఏకబిగిన రాయగలదిట్ట! ఇప్పుడు కంప్యూటర్ పరికరం వచ్చాక కథ రాయటం మరీ తేలికన్పిస్తోంది.

కథల రాసే కొత్తల్లో తప్పులెక్కువగా దొర్లటం మాట అట్టుంచితే రఫ్...

ఫెయిరు అంటూ ఒక్కో కథను రెండు మూడు సార్లు రాయాల్సి వచ్చేది. ఆ బాధ నేడు లేదు

ఆదాయం కొరకు... ఫ్యామిలీ స్టోరీలు.... కామెడీ కథలు... శృంగార కథలు... డిటెక్టివ్ కథలు... క్రైమ్ స్టోరీలు సరసమైన కథలు... దిక్కుమాలిన వెరైటీలన్నిటిలోనూ కథలు రాయటానికి అలవాటు పడ్డాడు! ఎర్నింగ్... పాపులారిటీ బాగా పెరిగింది.

కానీ దురదృష్టమల్లా... భగీరథరావుకు రావలసినంత పేరు ప్రఖ్యాతలు రాకపోవటం!- ఇన్నేళ్లుగా రాస్తున్నా... ఏ ఒక్క పోటీలో క్యాష్ ప్రైజ్ కొట్టకపోవటం!... ఎవ్వరూ సత్కారమో... సన్మానమో.. బిరుదు ప్రదానమో చెయ్యకపోవటంతో మనిషి తెగ బాధపడిపోతూంటాడు.

రైటర్‌గా ఎదిగే కొత్తల్లో అర్ధసెంచరీ కొట్టాలని కలలు కన్నాడు. తర్వాత సెంచరీ బాధటంపై దృష్టి సారించాడు. ఇప్పుడేమో కథల సంఖ్య సహస్రం దాటినా ఇంకా ఇంకా రాయాలనే తాపత్రయం మనిషిలో చావలేదు. రైటర్స్‌కు తృప్తి అనేదే వుండదు. కులగజ్జి ఎలాంటిదో.. రచయితలకు పాకే స్కిన్ డిసేజ్ లాంటిది ఇదీ. దీనికి విరుగుడు గాని నయం చేయటానికి మందులేదు.

మందుమానుకోవచ్చు! సిగరెట్ తాగటానికి ఫుల్ స్టాప్ పెట్టొచ్చు. సినీమాలు చూడకుండా వుండచ్చు!... పేకాట వదిలేయచ్చు... కానీ.. రైటరనే వాడు రాయటం మానడు. దటీజ్ భగీరథరావు.

పెళ్లి అయిన కొత్తలో కథలు రాయద్దు మొర్రోని భార్య చెవిలో జోరీగై మొరపెట్టుకున్నా తోసిరాజన్నాడు. అరిచి 'గీ' పెట్టినా... అడిగినప్పుడల్లా కాఫీ పెట్టి అందించకపోయినా.. అలిగి వంట చేయకపోయినా అంతపెద్దగ ఫీలవని మనిషి! రుషి కావటం కోసమే భగీరథరావు కృషి!

కథ రాసిన ప్రతిసారీ.. విందుభోజనం తిన్నంత తృప్తి ఫీలయ్యేవాడు. ఇటీవలి కాలంలో ఏ పత్రిక చూచినా ఏటా పది పన్నెండు సార్లు పోటీలు నిర్వహించటంతో తెగవుత్తేజింతుడవుతున్నాడు.

పత్రికలు పెరిగినయ్! రచయితలు పెరిగారు. బహుమతుల ఏమేంట్ కూడా అధికమైంది. అలాంటప్పుడు ఏరచయితా చేతులు ముడుచుక్కూర్చోడు!

సత్తా చాటుకునే ప్రయత్నం చేయక మానడు. ఇది పోటీ ప్రపంచం! అందుకే

... ఎన్నో పత్రికలు... ఎంతెంతోమొత్తాలను నగదు బహుమతులుగా ప్రకటిస్తూ తమ అభిరుచికి తగ్గ స్టోరీస్‌ను వెతికిపెట్టుకునే ప్రయత్నం చేస్తున్నయ్!.

× × × × ×

భగీరథరావు రిటైరైన నాటినుండి... భర్త తిన్నాడో... తాగేడో లేదో పట్టించుకోవటం మానేసింది. వృద్ధాప్యం మీద పడే కొద్దీ భార్యలో తనపట్ల పెరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఓకంట గమనిస్తునే వున్నాడు.

కడుపు కాలినపుడు ఆయనే తింటాడు! ఇంకా ఎన్నేళ్లని ఈయన్ను బ్రతిమాలటం?... ఇన్నేళ్లొచ్చాక మొగుడంటే ఇంకాదేనికి భయం అనుకుంది! అదలా... సాధింపులు వేధింపులు మొదలుపెడితే తాను ఒక్కతే కొడుకు దగ్గరకు వెళ్లి పోవటానికి నిర్ణయించుకుంది.

ఉద్యోగం సద్యోగం లేకపోతే అంతా తీరికే! కథలు అధిక సంఖ్యలో రాసేయచ్చనే తన ఆలోచన కేవలం భ్రమే అన్పించింది. ఎంత ఆలోచించినా బుర్రకు కొత్త ఐడియాలు రానే రాకపోవటం చూస్తూ ఆశ్చర్యానికి లోనవక తప్పటం లేదు.

బుర్రకు మాత్రం బుద్ధి లేదా ఏమిటి? ఎన్ని కొత్త ఐడియాలను ఏళ్ల తరబడి అందివ్వగలదు పాపం?!- దానికే రెస్ట్ కావద్దా?

ఐడియా వచ్చినట్టే అన్పించటంతో కొన్ని కథలకు శ్రీకారం చుట్టి పి.సి.లో కెక్కించాడు. కానీ అవి పూర్తై చస్తేనా?- అసంపూర్ణంగా ఓపాతిక కథలు మిగిలినయ్. వీటిగతేంటి చెప్మా? ఎప్పటికివి పూర్తి అవుతయ్. కాకున్న ఈ కథల భవిష్యత్ గురించి భగీరథ రావులో కంగారు... భయం... మొదలైనయ్.

అవతలేమో... కథలపోటీ ఆఖరు తేదీ దగ్గర పడుతోంది. ప్రారంభించిన కథలు పూర్తి అయి చావటం లేదు. ఇప్పుడెలా? తన్లాంటి సీనియర్ మోస్ట్ రైటర్ పోటీకి కథల పంపలేకపోవటమంటే... ఎంత షేమ్? ఇంకేమైనా వుందా?- నలుగురూ (పాఠకులు ప్లస్ కోరైటర్స్) నవ్విపోరూ?!-

ఈ వృద్ధాప్యంలోనైనా ఓ మంచి కథ రాసి పోటీకి పంపాలి!- ఇన్నేళ్లుగా పొందలేని ప్రథమ బహుమతిని తాను ఎట్టిపరిస్థితుల్లోనూ కైవశం చేసుకోవాలీ తప్పదు!! కథ పోటీకి పంపలేకపోయినా.. అథవా మెదటి బహుమతి లక్షరూపాయలు పొందలేకపోయినా ఈసారి ఉరేసుకోవటం ఖాయం! ఇక బ్రతకటం అనవసరం.

తనువు చాలించుటే ఎంతైనా సమయోచితం... సందర్భోచితం!

అత్తా ఆరాటమేగాని.... కోడలు కనేదిలేదనే సామెతలా తయారైంది భగీరధరావు పరిస్థితి! పోటీకి కథపంపాలనే తాపత్రయమేగాని పెండింగులో వున్న కథలేవీ కంప్లీట్ అయి ఏడవటం లేదు. ఇదేం ప్రసవవేదన చెప్మా? మనసు విలవిల్లాడి గిలగిలా తన్నుకుంటోంది! ఈ హింస తాను తట్టుకోలేడిక... ఇంతలో బ్రహ్మాండమైన ఐడియా మదిలో విద్యుల్లతా మెరవటంతో గబగబా లేచేసి సిటౌట్లోంచి బెడ్రూమ్‌లోకెళ్లి ఆటక మీదున్న తిరిగొచ్చిన పాత కథల కట్టలు కిందకు దించి దుమ్ము దులిపి.. ఆ కథలన్నీ లోగడ పత్రికల నుండి ఎందుకు తిరిగొచ్చివుంటాయో మళ్లీ ఒకసారి తెల్సుకోవాలనే అత్యుత్సాహంతో వాటిని చంకలో పెట్టుకునొచ్చి మరల సిటౌట్లో గల కుర్చీలో కూర్చుని ఒక్కోటి ఓపిగ్గా చదవనారంభించాడు.

పాత కథలు... తిరిగొచ్చిన కథలు చదువుతూంటే భగీరధరావుకి మెంటలొచ్చేట్టున్పించసాగింది. తల్లో నరాలు తెగి చచ్చిపోతానేమోనే భయం మరోవైపు.

'మహాప్రభో! మీరీ పిచ్చి వెతుకులాట ఆపండి. కథలు రాయటం మాని నాపసుపు కుంకుమలను కాపాడండి! కాఫీ అందిస్తూ అర్ధాంగి వేడుకుంది.

పాతవాటిలో మొత్తానికి ఒక కథ అత్యద్భుతంగవున్నదన్పించింది. దానికి తుది మెరుగులు దిద్ది... మకుటం మార్చి.... పతాక సన్నివేశాల్ని కుదించి... డి.టి.పి. చేసి మొత్తానికి కథలపోటీకి సకాలంలో పంపి ఊపిరిపీల్చుకున్నాను. ఈసారికి గడం గడిచి పిండం బైటపడ్డదన్పించింది!

× × × × ×

పోటీ బరిలో భగీరధరావు కూడా వున్నందుకు పరమానంద భరితుడైనాడు. ఈసారి తన శ్రమకు తగిన ఫలితం తప్పక లభిస్తుందన్పించింది.

అద్భుతమైన కథకు మొదటి బహుమతి లక్ష రాకుంటే.. ఆత్మార్పణ తథ్యం! ప్రముఖ కథా రచయిత ఆకస్మికంగా కన్నుమూత. శోక సముద్రంలో పాఠక దేవుళ్లు. అనేక మకుటాలతో అన్ని న్యూస్ పేపర్స్‌లో వార్తలు పబ్లిష్ కాక తప్పదు.

జాతస్యమరణం ధృవం! పుట్టిన వ్యక్తి గిట్టక తప్పదు. ఒక్కోరి మరణం ఒక్కో విధంగా వుంటుంది. తాను జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించాడు.

కావలసినన్ని కథలు రాశాడు. తనలో ఇంకేమీ కోరికలేదు.

తప్పో వప్పో... పాతికేళ్ల నాడు తిరిగొచ్చిన పాత కథకు సొబగులు దిద్ది... ఓల్డ్ వైన్ ఇన్ న్యూ బాటిల్ లాగ... ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్పించే విధంగా చేసిన మార్పులతో పోటీకి పంపటం జరిగింది! ఈ తృప్తి చాలు! లక్ష రూపాయల ప్రథమ బహుమతి తనదే!... నోడౌట్...

'ఏమండోయ్... పత్రికాఫీసు నుండి ఫోనొచ్చింది... మీకే!- మీ కథకు ఫస్ట్ ప్రైజ్ లక్షరూపాయలు వచ్చిందట!. ఈ ప్రైజు కోసం ఇన్నేళ్లుగా తపించిపోయారు కదా?- మొత్తానికి మీ కృషి ఫలించింది! ఆశయం ఎట్టకేలకు నెరవేరింది- మీ జన్మధన్యమైంది.. ఇంకా ఎంతసేపు మీ మొద్దు నిద్ర?- ఏమిటీ... మీరొస్తున్నారా...' రిసీవర్ పక్కన వుంచి గబగబా నిద్రపోతున్న భగీరథ రావు మంచాన్ని సమీపించి తట్టి నిద్ర లేపాలని భర్త వంటిమీద చెయ్యి వేసింది.

భర్తలో ఎటువంటి చలనం లేకపోవటంచూచి కంగారు పడింది! వళ్లు చల్లబడటంతో గాభరాపడింది ముక్కుదగ్గర వేలు పెట్టి శ్వాస ఆడుతున్నదో లేదోని పరీక్షించింది.

'ఓరినాయనో?... ఓరి దేవుడో... నా మొగుడు నాపసుపు కుంకుమలను తుడిపేసి వెళ్లిపోయాడ్రోయ్...' శోకాలు పెడుతూ డాక్టర్‌కు ఫోన్ చేసి పిలిపించింది.

చెకప్ చేసి భగీరథరావు మరణాన్ని ధృవీకరించాడు డాక్టర్!

(చిత్ర - మాసపత్రికలో ప్రచురితం)